సంపుటి :02 సంచిక :203 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 07, అక్టోబర్ 2025

## ఓటు చోరీపై
# సంతకాల సేకరణ

కాజీపేటలో ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

05



## ఊరి కోసం
# వాట్సాప్ విప్లవం

రాజకీయాలకతీతంగా మార్పు కోసం ఏకం!

- స్థానిక ఎన్నికల నేపథ్యంలో మేలుకొంటున్న యువత
- స్వచ్ఛమైన నాయకత్వం కోసం చర్చలు

02

గ్రామస్థాయి రాజకీయాల్లో కొత్త శక్తి ఉవ్వెత్తున ఎగసిపడుతోంది. పాతతరం నాయకత్వం, నిలిచిపోయిన అభివృద్ధిపై విసిగిపోయిన యువత... ఈసారి తమ గళాన్ని బలంగా వినిపిస్తోంది. రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా ఏకమవుతున్న ఈ తరం... 'మన ఊరి నాయకత్వాన్ని మనమే తీసుకుందాం' అంటూ సోషల్ మీడియా వేదికగా నినదిస్తోంది. అభివృద్ధి, పారదర్శకతే లక్ష్యంగా యువశక్తి చేస్తోన్న ఈ 'వాట్సాప్ విప్లవం' గ్రామీణ రాజకీయాల్లో ఎటువంటి మార్పులకు నాంది పలుకుతుందో, స్థానిక నాయకులపై ఎంతటి ఒత్తిడి తీసుకువస్తుందో తెలుసుకోవాలంటే... చదవండి ఆరో పేజీలో పూర్తి కథనం.

— అక్షర దర్బార్, పరకాల





## ఎన్నికల నిర్వహణకు
# పక్కడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్ల పరిశీలన
- పోలింగ్ కేంద్రాలను, చెక్ పోస్ట్ నూ పరిశీలించిన కలెక్టర్

02

## మార్కెట్ యార్డులో కౌంటింగ్

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సత్యశారద



05



## మంత్రుల మధ్య
# వివాదం

- అడ్లూరి, పొన్నంతో ఫోన్‌లో మాట్లాడిన పీసీసీ చీఫ్
- వివాదాన్ని జటిలం చేయవద్దని సూచన

02

తెలంగాణ పోలీసులకు ఇది పెద్ద విజయం!

నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో కీలక నేత, రూ. 8 లక్షల రివార్డు ఉన్న మంద రూబెన్ @కన్నన్న (67) మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఎదుట లొంగిపోయారు. గత 44 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న రూబెన్... అనారోగ్యం, సిద్ధాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో ప్రశాంత జీవితాన్ని కోరుకుంటూ సరెండర్ అయినట్లు సీపీ తెలిపారు. మాజీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు పిలుపు మేరకు ఉద్యమంలోకి వచ్చిన ఈ అగ్రనేత... 20 మంది సీఆర్పీఎఫ్ పోలీసుల హత్యతో సహా అనేక హింసాత్మక ఘటనల్లో నిందితుడు.

- అక్షర దర్బార్, హనుమకొండ



# మావోయిస్టు నేత లొంగుబాటు

- రూబెన్ స్వగ్రామం వంగపాడ్
- 1979లో ఆర్ఈసీ నుంచి అజ్ఞాతంలోకి
- వివిధ ప్రాంతాల్లో పలు బాధ్యతలు
- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్

03

# ఊరి కోసం ఏకం అవుదాం..

- అభివృద్ధి కోసం శక్తిగా మారతున్న యువత
- వాట్సాప్ గ్రూపులలో జోరుగా చర్చలు




అక్షర దర్బార్, పరకాల: "ఊరి కోసం ఏకం అవుదాం": రాజకీయాలను అటుంచి మార్పు కోసం యువత రంగంలోకి!.. పరకాల మండలంలోని పలు గ్రామాలలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై యువత నూతన శక్తిగా ఎదుగుతోంది. సోషల్ మీడియా వేదికగా చర్చల్లో మునిగి పోయిన ఈ తరం, ఊరి అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని నినదిస్తోంది. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, గత పదిహేనేళ్లుగా గ్రామాల అభి వృద్ధిలో మార్పు లేకపోవడం, ప్రతి ఎన్నికల సమయంలోనే నాయకులు యువతను పావులుగా చేసి, అనంతరం మరిచి పోవడంపై యువత తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. వా ట్సాప్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో, "ఈ సారి మనమే ముందుకు రావాలి", "మన ఊరి నాయకత్వాన్ని మనమే తీసుకోవాలి" అంటూ నినాదాలు చేస్తున్నారు.

## కుల, మత రాజకీయాలకు గుడ్ బై!

"మేము ఉన్నత విద్యనభ్యసించాము.. ప్రపంచాన్ని చూశాం కానీ మా ఊరును మాత్రం మార్చలేకపోతున్నాము.. ఈసారి మనం మారుదాం. కులాలు, పార్టీల గురించి కాదు – ఊరు బాగుపడాలన్నదే లక్ష్యం."గ్రామ స్థాయిలో యువతకు ఈ రీతిలో రాజకీయ చైతన్యం రావడం ఒక సానుకూల పరిణామమని, ఇది పాత తరం నాయకులపై ఒత్తిడి తీసుకురావచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అభివృద్ధి, పారదర్శకత, హేతుబద్ధత వంటి అంశాలు కేంద్రంగా పెట్టుకుని ముందుకు సాగాలని యువత ఆకాంక్షిస్తోంది.

## స్వచ్ఛమైన మార్పునకు యువతే మార్గదర్శకులు

ఈ విధమైన చైతన్యం గల యువత ఊరిలో నాయకత్వాన్ని చేపడితే, స్థానిక పాలనలో పారదర్శకత పెరుగుతుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలు గ్రామాల్లో యువత స్వయంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, అభి వృద్ధికి అవసరమైన అంశాలపై చర్చలు జరుపుతున్నారు. ఇది కేవలం మాటలకే పరిమితం కాకుండా కార్యరూపం దాలుస్తే, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఇది రాజకీయ పార్టీలకు గట్టి మేలుకోలు కావొచ్చని పరిశీలకులు అంటున్నారు.







# మంత్రుల మధ్య వివాదం

- అడ్లూరి, పొన్నంతో ఫోన్లో మాట్లాడిన పీసీసీ చీఫ్
- వివాదాన్ని జటిలం చేయవద్దని సూచన

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలో ఇద్దరు మంత్రుల మధ్య వివాదం చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్ర మంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ప్రచారంపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పందించారు. తనపై చేసిన వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ స్పందించాలని డిమాండ్ చేశారు. తాను పక్కన ఉంటే మరో మంత్రి వివేక్ ఓర్చుకోవడం లేదని, లేచి వెళ్లి పోతున్నారని ఆరోపించారు. పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం తనకు రాదని అన్నారు. ఆయన తన తప్పు తెలుసు కుంటారని అనుకున్నానని, ఇప్పటికీ మారకపోతే తర్వాత జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని అడ్లూరి వ్యాఖ్యానించారు. త్వరలోనే సోనియాగాంధీ, రాహుల్, ఖర్గే, మీనాక్షి నటరాజ్‌ను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ వెల్లడిం చారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అన్నారు. తాను మంత్రి కావడం మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. పొన్నం వ్యాఖ్యలపై ఖర్గే, మీనాక్షికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ లేఖ రాశారు. పొన్నం ప్రభాకర్ తీరుపై ఫిర్యాదు చేశారు. త్వరలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఖర్గేను కలుస్తానన్న అడ్లూరి రేపటిలోగా పొన్నం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## - మరింత జటిలం చేయవద్దు

మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌ల మధ్య తలెత్తిన వివాదంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఇద్దరి మధ్య చోటు చేసుకున్న వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరగడం, పొన్నం వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి స్పందించడంతో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం ఇద్దరితో ఫోన్‌లో మాట్లాడి వివాదాన్ని మరింత జటిలం చేయ వద్దని సూచించినట్లు సమాచారం. ఇద్దరు సమన్వ యంతో కలిసి పని చేసుకోవాలని ఒకరికొరు సహక రించుకోవాలని చెప్పినట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. పీసీసీ అధ్యక్షుడిగా జోక్యం చేసుకోవడంతో ఇద్దరు మంత్రుల మధ్య చోటు చేసుకున్న వివాదానికి తెరప డినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## - అడ్లూరి వ్యాఖ్యలపై స్పందించను

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించ నని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో మంత్రి స్పందించారు. పీసీసీ అధ్యక్షుడు తనతో మాట్లాడా రని, అదే ఫైనల్ అని వెల్లడించారు. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించానని, అడ్లూరి వ్యాఖ్యలపై తాను స్పందించనని స్పష్టం చేశారు. పార్టీ పరంగా తమకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యమని అన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పక్కడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్ల పరిశీలన
- పోలింగ్ కేంద్రాలను, చెక్ పోస్టునూ పరిశీలించిన కలెక్టర్




అక్షరదర్బార్, వర్ధన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పక్కడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశిం చారు. మంగళవారం వరంగల్ జిల్లాలోని వర్ధన్న పేట, రాయపర్తి మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సామాగ్రి, రిటర్నింగ్, సహాయ అధికారి స్వీకరణ గదులను, జనరల్ అబ్జర్వర్, వ్యయ పరిశీలకుల గదులు, ఎన్నికల సిబ్బంది, తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరగాలని, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి తీసుకోవలసిన భద్రతా చర్యలు, పాటించాల్సిన విధానాలు, ప్రజలకు అందు బాటులో ఉండే సౌకర్యాలపై సమీక్షించారు. ఎలాంటి పొరపాట్లు, ఆలస్యం లేకుండా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరగాలని, భద్రతాపరంగా పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ర్యాంపులు, దివ్యాంగులు వృద్ధుల కోసం అవసరమైన సదుపా యాలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి ఓటర్ సురక్షిత వాతావరణంలో ఓటు హక్కు విని యోగించుకొనేలా వాతావరణం కల్పించాలని అధికా రులను కోరారు. రాయపర్తి మండలం వరంగల్ జిల్లా సరిహద్దులో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, డీపీఓ కల్పన, హౌసింగ్ పీడీ గణపతి, డీబీసీడీవో పుష్పలత, నోడల్ అధికారులు, తాసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు ఉన్నారు.

# 18లీటర్ల గుడుంబా పట్టివేత



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం సూర్యానాయక్ తండా గ్రామంలో పోలీసులు 18 లీటర్ల నిషేధిత గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. శాయంపేట ఎస్ఐ జె. పర మేశ్వర్ వివరాల ప్రకారం, తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా బానోతు వసంత ఇంటి వద్ద గుడుంబా అమ్మకాలు జరుగుతున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చింది. వెంటనే అధికారులు అక్కడికి చేరి, పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి గుడుంబాను స్వాధీనం చేసు కున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# తల్లిని చంపిన తనయుడికి జీవితఖైదు

## భూపాలపల్లి సెషన్ కోర్టు తీర్పు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఆస్తికోసం కన్నతల్లిని రోకలిబండతో కొట్టి హత్య చేసిన నిందితుడికి భూపాలపల్లి సెషన్ కోర్టు న్యాయమూర్తి రమేష్ బాబు యావజీవ కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చారు, మొగుళ్లపల్లి ఎస్సై బొరగాల అశోక్ కథనం ప్రకారం.. మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోర్కిశాల గ్రామానికి చెందిన అప్పం రాజ్ కుమార్ 2024 జులైలో ఆస్తి కోసం కన్నతల్లిని రోకలి బండతో కొట్టి చంపేశాడు. నిందితుడి తమ్ముడు అప్పం అశోక్ కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఎస్సై బోరగల అశోక్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా చిట్యాల సీఐ డి.మల్లేశ్ పరిశోధన చేసి పూర్తి ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. న్యాయస్థానంలో సాక్ష్యధారాలు పరిశీ లించి, నిందితుడుకి శిక్ష యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ చేసిన మొగుళ్లపల్లి ఎస్సై బి.అశోక్ ను ఇన్వెస్టి గేషన్ చేసిన చిట్యాల సీఐ డి.మల్లేష్, వాదనలు వినిపించిన ఎదలా పురం శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకన్న, ఏఎస్ఐ లైజన్ అధికారి సీహెచ్.జ్యోతి, సెషన్స్ కోర్టు సీడీఓ సాక్షులను ప్రవేశపెట్ట డంతో నేరం రుజువు కాగా మెజిస్ట్రేట్ నిందితుడు అప్పం రాజ్ కుమార్ కు జీవిత ఖైదుతో పాటు రూ.వంద జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

# బీజేపీ స్టేట్ చీఫ్ ను కలిసిన సంతోష్ కుమార్



అక్షర దర్బార్, పరకాల: బీజేపీ తెలంగాణ చీఫ్ రామచందర్ రావు, ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, వీరేందర్ గౌడ్ ను మంగళ వారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్, రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చింది బీఆర్ఎస్సే..




అక్షర దర్బార్, టేకుమట్ల: బీఆర్ఎస్ పార్టీ పాలనలో తెలంగాణ అప్పులకుప్పగా మారిందని, హామీలను మరిచి ప్రజా ధనాన్ని దోచుకున్న పార్టీగా బీఆర్ఎస్ గుర్తింపు పొందిందని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ ఆరోపించారు. రామకృష్ణాపూర్(టి) గ్రామ శాఖ అధ్యక్షుడు కౌడగానీ నవీన్, టేకుమట్ల టౌన్ అధ్యక్షుడు పెరుమాండ్ల క్రాంతి ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ దోకా కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి సోనియమ్మ ఇచ్చిన ఈ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుని అప్పులకుప్పగా మార్చిందని మండిపడ్డారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు దోచుకుని నాశనం చేశారని మండిపడ్డారు. ఇక ప్రజలు బీఆర్ఎస్ మాయలో పడరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలల్లో ప్రజలకు చేసిన పనులు చూస్తే, బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో చేసినది దోపిడీ తప్ప మరేమీ లేదని సతీష్ గౌడ్ అన్నారు.

# విష్ణు సహస్రనామ పారాయణం



అక్షర దర్బార్, వరంగల్: వరంగల్ నగర మధ్యలో గల గోవిందాద్రి కొండపై వెలసిన శ్రీ గోవిందరాజ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని గోవిందాద్రి గోశాల వ్యవస్థాపక అధ్యక్షులు గర్నెపల్లి మాధవి సుధాకర్ ఆధ్వర్యంలో వారి భక్త బృందం నిర్వహించింది. ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి పర్యవేక్షణలో వందలాది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వరయోగుల లక్ష్మణ స్వామి, ప్రసాద్ స్వామి, మురళీకృష్ణ స్వామి, భక్తులు సుధాకర్, మాధవి, లక్ష్మి, లావణ్య, దీపిక, రాజేశ్వరి, శోభ తదితరులు పాల్గొన్నారు.



# మావోయిస్టు నేత లొంగుబాటు

- రూబెన్ స్వగ్రామం వంగపాడ్
- 1979లో ఆర్ఈసీ నుంచి అజ్ఞాతంలోకి
- వివిధ ప్రాంతాల్లో పలు బాధ్యతలు
- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్



**అక్షరదర్బార్, హనుమకొండ:** నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి, సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యుడు, దండాకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన మంద రూబెన్ @కన్నన్న @మంగన్న @సురేష్(67) మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట లొంగిపోయాడు. ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ సీపీ మీడియాకు వివరాలను వెల్లడించారు. హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్ 1979 సంవత్సరంలో కాజీపేటలోని ఆర్ఈసీలో హాస్టల్ మెస్ విభాగంలో పని చేశాడు. ఆ సమయంలో రాడికల్స్ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడయ్యాడు. మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, ఒక్కప్పటి ఆర్ఈసీ పూర్వ విద్యార్థి నంబాల కేశవ రావు పిలుపు మేరకు మావోయిస్టు పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. 1981 సంవత్సరం నుంచి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వంలో దళ సభ్యుడిగా కుంట, బస్తర్ ప్రాంతాల్లో పనిచేసాడు.

1987లో మావోయిస్టు పార్టీ నాయకత్వం రూబెన్ కు ఏరియా కమిటీ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించింది. 1991లో అనారోగ్యంతో చికిత్స కోసం కొత్తగూడెంకు వెళుతున్న సమయంలో ఛత్తీస్ గడ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలుకు తరలించగా, ఏడాది తర్వాత రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలసి 1992లో జైలు నుంచి తప్పించుకున్నాడు. రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీలో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేసాడు. ఇదే సంవత్సరంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ @రామన్న@ గోపన్న బీజాపూర్ జిల్లా గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమేతో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005లో డివిజన్ కమిటీ సభ్యుడిగా పని చేస్తున్న సమయంలో అనారోగ్యం కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం ఉంటూ, కోళ్లు, గొర్రెల ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసే వాడు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ నాయకులతో పాటు దళ సభ్యులకు షెల్టర్, భోజన వసతులను కల్పిస్తూనే పోలీసుల కదలికలను గమనిస్తూ మావోయిస్టులకు సమాచారం అందించేవాడు. అనారోగ్యంతో బాధపడుతున్న రూబెన్ ఉద్యమంలో పాల్గొనేందుకు శరీరం సహకరించకపోవడం, ముఖ్యంగా మావోయిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టులపై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాల ద్వారా ప్రశాంత వాతావరణంలో తన కుటుంబ సభ్యులతో జీవించాలని, నిర్ణయించుకొని పోలీసుల ఎదుట లొంగిపోయాడని సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.

### రూబెన్ పాల్పడిన నేరాలు

కుంట దళ సభ్యుడిగా పనిచేసే సమయంలో రూబెన్ పెద్దకెడు వాల్, పండోడు, పిడిమాల్, బండారిపాడు గ్రామాల్లో గ్రామస్తులను దళ సభ్యులతో కలసి హత్య చేయడంతో పాటు, ఎలమకొండా గ్రామ సర్పంచ్ ను హత్య చేసిన సంఘటనల్లో నిందితుడు. 1988లో గొల్లపల్లి– మారాయిగూడ మార్గంలో పోలీసుల కాన్వాయిపై మావోయిస్టులతో కలసి 20 మంది సీఆర్పీఎఫ్ పోలీసులను దారుణంగా హత్య చేసి వారి ఆయుధాలను పట్టుకుపోయిన సంఘటనలో నిందితుడు. 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడు గోపన్నతో కలసి తుర్లపాడు పోలీస్ స్టేషన్ పై దాడి చేసిన ఘటనలోనూ రూబెన్ నిందితుడు. రూబెన్ పై రూ.8 లక్షల రివార్డ్ ఉందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.



# ఓటు చోరీ పోరాటానికి సంతకాల సేకరణ

**శాయంపేటలో ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర**

అక్షర దర్బార్, శాయంపేట: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించిన ఓటు చోరీ వ్యతిరేక పోరాటానికి మద్ధతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శాయంపేట మండల కేంద్రంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి రావడంలో ఓటు చోరీ కీలక పాత్ర పోషించిందని, తెలంగాణలో ఎనిమిది ఎంపీ సీట్లు కూడా అలాంటి మోసాల కారణంగా గెలిచాయని ఆరోపించారు. ప్రతి గ్రామంలో కనీసం 100 సంతకాలు సేకరించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజలు కలిసికట్టుగా వ్యవహరించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే నివాళులర్పించారు. మహర్షి రామాయణం మానవాళికి అందించిన మహాకావ్యమని, ఆచార్యుడి జీవితం మనకు ఆదర్శమని ఎమ్మెల్యే అన్నారు.

# అభ్యర్థుల ఖర్చు పక్కాగా నమోదు

**: అదనపు కలెక్టర్ విజయలక్ష్మి**



అక్షర దర్బార్, భూపాలపల్లి: ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ప్రచార ఖర్చులను కచ్చితంగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ మినీ సమావేశ హాల్లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రచార ఖర్చులపై పర్యవేక్షణ కోసం రేట్ చార్ట్ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు, ప్రచార వాహనాలు, ప్రకటనలు వంటి అంశాలకు స్థానిక రేట్ల ఆధారంగా ఖర్చులు లెక్కించబడతాయని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి ముందు అనుమతులు పొందాలని, నిర్ణీత నియమాలను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆడిట్ అధికారి మానస, డిపిఓ శ్రీలత, డిపిఆర్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ కు
# సరైన బుద్ధి చెప్పాలి

- ఆ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చింది
- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్

అక్షర దర్బార్, మరిపెడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ పిలుపునిచ్చారు. మరిపెడలో జరిగిన మండల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు అడగలేని పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే బీఆర్ఎస్ విజయం ఖాయమని అన్నారు. సమావేశంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, అచ్యుతరావు, కుడితి మహేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు ఎంపీటీసీలు, ఎంపీపీలు, మాజీ కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ చేసిన గండ్ర జ్యోతి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండలంలోని మెట్టుపల్లి, పిడిసిల్ల. బంగ్లా పల్లె పెద్ద కమిటీ పర్లపల్లి గ్రామంలో భూపాలపల్లి టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ జడ్పీ చైర్పర్సన్ గండ్ర జ్యోతి మంగళవారం కాంగ్రెస్ బాకీ కార్డు పేరుతో ఇంటింటికి తిరిగి ప్రజలకు అర్థమయ్యేలా కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ.. ప్రజలకు అమలు కానీ అనేక హామీలు ఇచ్చి దొంగ చాటు కాదు గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని తెలిపారు వారి వెంట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# లక్షల కోట్లు దిగమింగి కాంగ్రెస్ పై విమర్శలా?

## కాంగ్రెస్ మొగుళ్లపల్లి మండల కమిటీ


అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లక్షల కోట్లు దిగమింగి రాష్ట్రాన్ని దివాలా చేశారని మొగుళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం మొగుళ్ళపల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమార్ స్వామి, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రఫీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్, టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజ్ రమేష్ మాట్లాడుతూ పదేళ్ల పాలనలో 8 లక్షల కోట్లు దిగమింగి నేడు కాంగ్రెస్ పార్టీపై విమర్శలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ప్రజల్లో తిరుగుతూ విష ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నేతృత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాబోయే కాలంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.




# సీజేఐపై దాడిని ఖండిస్తున్నాం..

## సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కుమారస్వామి

అక్షర దర్బార్ నల్లబెల్లి : సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ పై ఇటీవల జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి పేర్కొన్నారు. నల్లబెల్లి మండల కేంద్రంలో సీపీఐ, సీపీఎం నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఐ గవాయి, ఖజురహో విష్ణుమూర్తి విగ్రహ పునఃప్రతిష్టా పిటిషన్‌ను డిస్మిస్ చేసిన నేపథ్యంలో ఆరెఎస్ఎస్ ఆగ్రహం తీర్చడానికి న్యాయవాది చేత బూటు విసిరించి దాడికి పాల్పడడం అమానుష చర్య అని పేర్కొన్నారు. దేశంలో సనాతన ధర్మం పేరుతో విభేదాలు, దాడులు జరగకుండా ప్రజలు ఐక్యతతో ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శులు కడియాల క్రాంతి కుమార్, కడియాల మనోహర్, బీసీ హక్కుల సాధన సమితి మండల నాయకులు కోల లింగయ్య తెలంగాణ రైతు సంఘం మండల నాయకులు గంగారపు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు

అక్షర దర్బార్ శాయంపేట : రౌడీ షీటర్లపై పోలీసుల నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని,చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ రంజిత్ రావు హెచ్చరించారు. స్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు సీఐ రంజిత్ రావు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ పరమేశ్వర్ పాల్గొన్నారు.

# ఏఈఓ కక్షసాధింపు

- రైతును గ్రూపు నుంచి తొలగింపు..
- అక్రమాలపై ఫిర్యాదు చేసిన రైతునే లక్ష్యంగా చేసుకున్న విస్తరణ అధికారి

అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా పరకాల మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రైతు కొత్త కృష్ణారెడ్డి ని నాగారం ఏఈఓ ఇబ్బందులు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. రైతు కృష్ణ రెడ్డి మాట్లాడుతూ యూరియా పంపిణీలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేసినందుకు తనను లక్ష్యంగా చేసుకుంటూ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) కక్షసాధిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా రైతులతో ఉండే వాట్సాప్ గ్రూప్ నుండి ఆయన్ను ఏఈఓ రిమూవ్ చేసినట్లు సమాచారం. "నాకు యూరియా వంటి ముఖ్యమైన వ్యవసాయ సమాచారాన్ని అందించకుండా గ్రూప్ నుంచి తొలగించడమే కాకుండా, నాపై దుర్వినియోగ భాషలో మాట్లాడడం జరిగింది," అని బాధితుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనపై గత నెల 29న మండల వ్యవసాయ శాఖ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికార యంత్రాంగ నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "అక్రమాలకు పాల్పడిన అధికారిపై చర్యలు తీసుకోవాల్సినవారు, ఆయన చేతిలో బాధితుడైన నన్నే పట్టించుకోకపోతే, అన్నదాతకు అండగా ఎవరు నిలుస్తారు?" అని కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాగారం ఏఈఓ మీద పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ప్రభుత్వానికి స్థానిక ఎన్నికలపై చిత్తశుద్ధి లేదు

- బాకీ కార్డులతో కాంగ్రెస్ పునాదులు కదులుతున్నాయి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి




అక్షర దర్బార్, భూపాలపల్లి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికలు నిర్వహించే చిత్తశుద్ధి లేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు. భూపాలపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి 660 రోజులు పూర్తయినా ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోయింది" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు "కాంగ్రెస్ బాకీ కార్డులు" అందజేస్తూ, వారి హామీలను గుర్తు చేసే కార్యక్రమం జరుగుతుంటే కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని ఆయన అన్నారు. "మేము కొత్త హామీలు ఇవ్వడం కాదు, వారు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్నాం. ప్రతివిమర్శలు చేయడం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి" అని గండ్ర సూచించారు. రాబోయే 38 నెలలలో ఈ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లి నిలదీస్తామని గండ్ర స్పష్టం చేశారు. "భూపాలపల్లిని జిల్లా స్థాయికి తీసుకువచ్చినది, మెడికల్ కాలేజ్ ఏర్పాటు, ఇంటింటికి తాగునీరు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు అందించినది కేసీఆర్ ప్రభుత్వం. కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతులకు యూరియాను కూడా అందించలేకపోతోంది" అని ఆయన విమర్శించారు. ప్రధాన ప్రతిపక్ష హోదాలో బీఆర్ఎస్ పార్టీకి ప్రశ్నించే హక్కు ఉందని, ప్రభుత్వం ప్రజలకి సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమదని గండ్ర వెంకట రమణారెడ్డి స్పష్టం చేశారు.

# మహర్షి వాల్మీకికి ఎస్పీ నివాళి..




అక్షర దర్బార్, భూపాలపల్లి: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ కిరణ్ ఖరే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. "మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ప్రతి మనిషి జీవితానికి మార్గదర్శక గ్రంథం. ఆయన చూపిన సత్యం, ధర్మం, కర్తవ్య మార్గాలు నేటికీ సమాజానికి ప్రేరణగా నిలుస్తున్నాయని, ఆయన నైతిక విలువలను మనమందరం జీవితంలో ఆచరించాలి" అని పేర్కొన్నారు.

# మృతుల కుటుంబాలకు కీర్తిరెడ్డి పరామర్శ..



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి పరామర్శించారు. గోపాలపురం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత ఎర్రబోయిన సదయ్య కూతురు ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త శ్రీరామోజు శ్రీకాంత్ బంధువు చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. తిరుమలాపురం గ్రామంలో మృతి చెందిన కందుల ప్రమీల, గోపగాని లక్ష్మయ్య కుటుంబాలను కీర్తిరెడ్డి పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏడు నూతల నిశిధర్ రెడ్డి, బీజేపీ చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రె శశికుమార్, జిల్లా కార్యదర్శి సుదగాని శ్రీనివాస్ గౌడ్, నాయకులు అనిల్, రాజేష్, శ్రీకాంత్, మందకృష్ణ, గోపగాని స్వామి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

## బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ



అక్షర దర్బార్ శాయంపేట : నిజమైన అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజల ఓట్లను దోచుకోవడం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు "డోకా కార్డ్" "బాకీ కార్డ్" పేరుతో కొత్త రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. ప్రజల నిజమైన సమస్యలను పక్కనబెట్టి, తప్పుడు హామీలతో రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటూ మోసం చేస్తోందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతు, విద్యార్థి, నిరుద్యోగి, కూలీ.. ప్రతి వర్గం మోసపోయిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలన అంటే అవినీతి, అసమానత, ఆడంబరమేనని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు భూతం తిరుపతి, మామిడి విజయ్, జిల్లా సీనియర్ నాయకులు బాసాని విద్యాసాగర్ వనం దేవరాజ్, గడ్డం రమేష్ ఉప్పు రాజు, మోత్కూరి సత్యనారాయణ యువమోర్చా జిల్లా నాయకులు లడే శివ, కొత్తపెల్లి శ్రీకాంత్, బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీపై సంతకాల సేకరణ

**- కాజీపేటలో ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని**




అక్షరదర్బార్, కాజీపేట: బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడిందని, ఈసీ బీజేపీ కనుసన్నల్లో నడుస్తున్నదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఓటు చోరీపై కాజీపేట చౌరస్తాలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య పాల్గొన్నారు. ఓటు చోరీ ఆపాలని సంతకం చేసి కేంద్రానికి తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. ఓటు చోరీపై బూత్, డివిజన్ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించాలని ఎమ్మెల్యే నాయిని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు కోల్పోవడం అంటే సర్వం కోల్పోవడం అని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గతంలో ఓట్లను అపహరించాయని, శాసన సభ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో వ్యత్యాసం ఉందని అన్నారు. ప్రజలందరు మాకెందుకు అనుకుంటే బిజెపి ప్రభుత్వం ఈసీ తో కలిసి మన ఓట్లను చోరీ చేస్తున్నదని గుర్తు చేశారు. గడిచిన చాలా కాలంగా రాహుల్ గాంధీ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పాల్పడిన ఓట్ల చోరీపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారని అన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు చేస్తూ, మతపరమైన రాజకీయాలకు పాల్పడుతు, ఆర్థిక సంక్షోభంలో దేశం ఉన్నప్పటికీ వారికి అధికార బదలాయింపు ఉంటుందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చేస్తున్న ఓటు చోరీ పోరాటంలో కేంద్ర ప్రభుత్వం, ఈసీ సరైన సమాధానం చెప్పలేదని మండిపడ్డారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మోసం చేస్తున్న బీజేపీ తీరును ప్రజలు ఖండిస్తున్నారు. ఓటు చోరీలు, ఈసీ పాక్షిక వైఖరికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ స్వరం కలిపి పోరాటం చేయాలి. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరగాలి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్రంలో బీజేపీ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను అణిచివేయాలని చూస్తోందని నాయిని మండిపడ్డారు.



# మార్కెట్ యార్డులో కౌంటింగ్

**- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సత్యశారద**



అక్షరదర్బార్, వరంగల్: స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్తు సీఈఓ రామిరెడ్డిలతో కలసి ఏనుమాముల మార్కెట్ యార్డులో వరంగల్ జిల్లాలోని 11 మండలాలకు సంబందించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను, క్షేత్రస్థాయిలో పరిశీలించి పటిష్టంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ లోని గోడౌన్ నెంబర్ 17ఏ, 17బీ, 17సీ, 17డీ గదులను కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లకు గాను గదుల విస్తీర్ణాన్ని పరిశీలించారు. పోలింగ్ అనంతరం జిల్లాలోని 11 మండలాల బ్యాలెట్ బాక్స్ లను భద్రపర్చడానికి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లు పక్కపక్కనే ఉండేలా చూడాలన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్లో మండలానికి సుమారుగా 14 టేబుళ్లు చొప్పున 11 మండలాలకు కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయాలని, ఏ విధంగా అమరిస్తే సౌకర్యంగా ఉంటుందో పక్కా ప్రణాళిక చేయాలన్నారు. కౌంటింగ్ లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను అధికారులు సమీక్షించుకోవాలని, కౌంటింగ్ కొరకు కౌంటింగ్ సిబ్బంది, ఎజెంట్స్, ప్రవేశం, బయటకు వెళ్లేదారి వేర్వేరుగా బారికేడ్లతో ఉండాలని, ఎన్నికల భద్రత, విద్యుత్, వీఐపీ పార్కింగ్, పోలింగ్ ఏజెంట్లకు కావాల్సిన నీటి, టాయిలెట్స్ సౌకర్యం, పార్కింగ్ లలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల , ప్రాంతాల్లో భద్రత అత్యంత కట్టుదిట్టంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల సామగ్రి గది, కమ్యూనికేషన్ గది, అబ్జర్వర్ల గది ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు. అవసరమైన మరమ్మత్తులు, సరిపడా లైటింగ్, కావలసిన వసతులతో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, హౌసింగ్ పీడీ గణపతి, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బజ్జుతండా గ్రామంలో కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలం బజ్జుతండా (చిన్నతండా) గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువ నాయకుడు రవి చిన్న రాథోడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత రవి చిన్న రాథోడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలబడే స్థితిలో కాంగ్రెస్ నాయకులు లేరని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మోసాలకు సమాధానం చెబతామని మహిళలు, యువత, రైతులు సిద్ధంగా ఉన్నారని, పంచాయతీ ఎన్నికల్లో ప్రతికారం చూపించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.



# అందరి చూపు హైకోర్టు వైపే..!

- సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధంగా రిజర్వేషన్లు
- స్థానిక రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో కేసు విచారణ



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: ఎన్నికల షెడ్యూల్ సమీపిస్తున్న కొద్ది స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే ఆశవాహులలో తో పాటు తెలంగాణ ప్రజలలో ఉత్కంఠ రేగుతోంది. రాష్ట్ర ప్రజల చూపు హైకోర్టు తీర్పుపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా స్థానిక రిజర్వేషన్లను ఖరారు చేసింది అని పలువురు మేధావులు చర్చించుకుంటున్నారు. బీసీలకు 42%, ఎస్సీలకు 15%, ఎస్టీలకు 10% రిజర్వేషన్లు .. మొత్తంగా 87% రిజర్వేషన్లను కల్పించింది. ఇది రిజర్వేష క్షపై సుప్రీంకోర్టు విధించిన 50% సీలింగ్ను మించిపోతున్నది. పైగా రిజర్వేషన్లకు సంబంధిం చిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్లో ఉండగానే ప్రభుత్వం వాటి అమలు కోసం జీవోను విడుదల చేసింది. ఇలా ఎటుచూసినా ఈ రిజర్వేషన్లు కోర్టులో నిలబడవని న్యాయకోవిదులు స్పష్టంగా తేల్చిచెపున్నారు.

## రిజర్వేషన్లు మారనున్నాయా?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డీ(6), 243-టీ(6) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న అధికారాన్ని వినియోగించి తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ను కల్పించింది. ఈ మేరకు గవర్నర్ పేరిట బీసీ సంక్షే మశాఖ ఇటీవల జీవో- 9ని జారీచేసింది. దీనికి అనుగుణంగా జడ్పీ చైర్పర్సన్ స్థానాలకు పంచా యతీరాజ్ కమిషనర్, జడ్పీటీసీ, ఎంపీపీ స్థానా లకు జిల్లా కలెక్టర్లు, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానా లకు ఆర్టీవోలు, వార్డు సభ్యుల స్థానాలకు ఎంపీ డీవోలు రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఎన్నికల షెడ్యూల్ను కూడా ప్రకటించారు. అయితే జీవో-9ను సవాల్ చేస్తూ పలువురు కోర్టును ఆశ్రయిం చారు. దీంతో ప్రస్తుతం కల్పించిన రిజర్వేషన్లు మారుతాయా? మొత్తం రిజర్వేషన్లే రద్దవు తాయా? అనే చర్చ కొనసాగుతున్నది. జీవో 9ని కోర్టులు కొట్టేస్తే రిజర్వేషన్లన్నీ రద్దవుతాయని న్యాయకోవిదులు, పలువురు ఉన్నతాధికారులు ఘంటాపథంగా చెప్తున్నారు. అప్పుడు కొత్తగా మళ్లీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. 8న హైకోర్టు ఇచ్చే తీర్పుతో ఈ ఉత్కంఠకు తెరపడేఅవకాశాలు ఉన్నాయి

# చిట్యాలో 'బీఆర్ఎస్ దోకా కార్డు' ఆవిష్కరణ

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ దోక కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి మాట్లడుతూ.. గత 20 నెలల్లో కాంగ్రెస్ పార్టీ పేదలు, బడుగు వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా తెలంగాణను మార్చారని, రాష్ట్రాన్ని దోపిడీ చేసి కోట్ల రూపాయల బాకీ పెట్టినారని మండిపడ్డారు. ఆయన చెప్పినట్లుగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఐదు హామీలను అమలు చేస్తూ పేదలకు, మహిళలకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిన సేవలను వివరించారు. కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖిరాల మధు వంశీ కృష్ణ, మండల మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, యువకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915